
సాక్షి
మంచిర్యాల
సోమవారం : 24 : ఏప్రిల్ : 2023



గుడుంబా మత్తు! 8లో▸

గుడుంబా పచ్చని కుటుంబాల్లో విషాదం నింపుతోంది. తాగుడుకు బానిసై పలువురు యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అనారోగ్యానికి గురై మృత్యువుకు దగ్గరవుతున్నారు.



ఒకే క్షేత్రం.. పంటలు అనేకం

చెన్నూర్ పట్టణానికి చెందిన మద్ద మధు అనే రైతుకు ఎడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో మామిడి, ఆయిల్‌పామ్, చేపల పెంపకం, సపోటా, ఎర్ర చందనం, కంకవనం, సీతాఫలం, ఇతర మొక్కలు పెంచుతున్నాడు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.8 /25.5

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు తగ్గుతాయి. ఎండ తీవ్రత కూడా తగ్గుతుంది. మధ్యాహ్నం తర్వాత వడగండ్ల వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

మంచిర్యాలఅర్బన్: పాఠశాలలకు ఈనెల 25 నుంచి జూన్ 11 వరకు విద్యాశాఖ వేసవి సెలవులు ప్రకటించింది. 48 రోజుల సెలవుల అనంతరం తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో మార్చి రెండో వారం నుంచి ఒంటి పూట బడులు ప్రారంభమయ్యాయి. ఈనెల 24న పాఠశాల చివరి పనిదినం. సోమవారం విద్యార్థులందరికీ ప్రోగ్రెస్ రిపోర్టు అందజేయనున్నారు. ఉపాధ్యాయులు పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఎగ్జామ్ రిజల్ట్స్ వెల్లడి, వేసవి సెలవుల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. సూచనలు చేయనున్నారు. ఉపాధ్యాయుల కొరత అధిగమించేందుకు డిప్యూటేషన్ పేరిట సర్దుబాటు చేసిన టీచర్లు సోమవారం పాత పాఠశాలలో రిపోర్టు చేయనున్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఇంటిబాట పట్టనున్నారు.

పాఠ్యాంశాలు తొలగింపు సరికాదు

మంచిర్యాలఅర్బన్: ఎన్సీఈఆర్టీ సిలబస్ నుంచి జీవ పరిణామక్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలు తొలగించటం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు అన్నారు. చరిత్ర నుంచి మొఘలుల చరిత్ర, గాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు తదితర పాఠ్యాంశాలను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్సీఈఆర్టీ తక్షణమే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ పదో తరగతి పాఠాల నుంచి డార్విన్ సిద్ధాంతం తొలగించటం అంటే విద్యలో మూఢ నమ్మకాలు పెంచటమే అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి తిరుపతి పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ ఈదేశ చరిత్రను పాఠ్యాంశాలు మార్చి తన భావజాలాన్ని తీసుకురావటాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

నాసి రకం మట్టితో జంక్షన్ల అభివృద్ధి



జంక్షన్లలో పోస్తున్న నాసిరకం మట్టి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఇటీవల మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రూ.4 కోట్లతో నాలుగు జంక్షన్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఒక్కో జంక్షన్ కోసం రూ.కోటి వెచ్చిస్తున్నారు. ఆయా పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు జంక్షన్ల వద్ద సర్కిల్‌ను ఏర్పాటు చేయగా, సర్కిల్ మధ్యలో నాసిరకం మట్టిని నింపుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నాణ్యతతో కూడిన పనులను చేపట్టేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


కొట్టక్కల్ ఆర్య వైద్యశాల ప్రారంభం



ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీలో మైత్రి యోగ ప్రకృతి చికిత్సా కేంద్రంలో ప్రాచీన వైద్యం అందించే కొట్టక్కల్ ఆర్య వైద్యశాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా సత్య ఆయుర్వేద వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ సమత ఉచిత వైద్య సలహాలను అందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండా సుధాకర్, డాక్టర్ సమీరారెడ్డి, డాక్టర్ సుకుమార్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 63 విస్తరణపై కేంద్ర మంత్రికి వినతి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట: నిజామాబాద్ నుంచి మంచిర్యాల వరకు చేపడుతున్న ఎన్‌హెచ్ 63 విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న బాధితుల సమస్యను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బాధితులతో కలిసి ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ లక్సెట్టిపేట్ పట్టణం, కన్నెపల్లి గ్రామంలో జాతీయ రహదారి విస్తరణతో భూములు భవనాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. జాతీయ రహదారి పట్టణం మధ్యలో నుంచి వెళ్తుండడంతో నష్టం జరుగుతుందని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఎలా?



లేఅవుట్ చేసి అనుమతులు తీసుకోకుండానే పాత మంచిర్యాలలో వెంచర్ చేసి అమ్మకాలు జరిపిన భూమి

- 2020లో దరఖాస్తుల స్వీకరణ
- కోర్టు స్టేతో మూడేళ్లుగా పెండింగ్..
- తాజాగా క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశాలు
- మున్సిపాలిటీల్లో ప్రారంభమైన పరిశీలన
- సిబ్బంది కొరతతో నత్తనడకన ప్రక్రియ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీల్లోని అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా 2020లో దరఖాస్తులు స్వీకరించింది. ఒక్కో దరఖాస్తుకు రూ.1000 చొప్పున ఫీజు వసూలు చేయగా, వీటి పరిశీలన కోర్టు ఆదేశాలతో నిలిచిపోయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మున్సిపల్ అధికారులు పక్కన పెట్టేశారు. తాజాగా రాష్ట్ర పరపాలక శాఖ దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్(లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం)దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ప్రారంభమైంది.

సిబ్బంది కొరత..

దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేందుకు అవసరమైన టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది లేరు. జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం ఒక్క మంచిర్యాల మున్సిపాలిటీకే ఉన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసే టీపీబీవోలు, టీపీఎస్‌లు లేరు. ఇతర మున్సిపాలిటీల్లో పనిచేసే వారికే వారంలో రెండు నుంచి మూడు రోజులపాటు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు ఇచ్చే మౌఖిక ఆదేశాలతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనతోపాటు, అవసరమైన వాటికి అనుమతులను ఇస్తున్నారు. ఇందుకోసం ఎల్ఆర్ఎస్‌కు రావాల్సిన డబ్బులను ఫీజు రూపంలో తీసుకుంటూ ఆయా స్థలాలకు ఇంటిని నిర్మించుకునేందుకు, రిజిస్ట్రేషన్ చేసుకుని అమ్మకాలను చేపట్టేందుకు అనుమతులు ఇస్తున్నారు.

కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే

ఎల్ఆర్ఎస్ పథకంపై సుప్రీం కోర్టులో కేసు పెండింగులో ఉంది. అయినా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని మున్సిపల్ రాష్ట్ర శాఖ అధికారులు అనధికారికంగా ఇచ్చిన ఆదేశాలతో పెండింగులో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే సుప్రీం కోర్టు నుంచి వెలువడే ఆదేశాలకు కట్టుబడి ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌ను షరతులతో కూడిన కాపీ మాత్రమే జారీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. అధికారులు మాత్రం 2020లో ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులన్నింటిని ఒకసారి పరిశీలించి, వాటికి సంబంధించిన వివరాలను సిద్ధం చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు చెబుతున్నారు.

ఖాళీలతో ఇబ్బందులు

మంచిర్యాల మున్సిపాలిటీలో ఒక టౌన్‌ప్లానింగ్ అధికారి ఉండగా, రామగుండం టీపీఎస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించగా, వారంలో 4 రోజులే పనిచేస్తున్నారు. ఇద్దరు టీపీఎస్‌లు, నలుగురు టీపీబీవోలు మంచిర్యాల మున్సిపాలిటీకి అవసరం. నస్పూరు, చెన్నూరు, బెల్లంపల్లి మున్సిపాలిటీలకు ఇతర మున్సిపాలిటీలకు చెందిన టీపీఎస్ ఒక్కరికి రెండు మూడు రోజులు విధులను నిర్వర్తించేలా విధులను కేటాయించారు. లక్సెట్టిపేట, మందమర్రి, క్యాతన్‌పల్లికి ఒక్క టీపీఎస్‌కే విధులను కేటాయించారు. ప్రస్తుతం ఏడు మున్సిపాలిటీల్లో కేవలం ఒక్క మంచిర్యాల మున్సిపాలిటీకి మాత్రమే టౌన్ ప్లానింగ్ అధికారి ఉన్నారు. మిగతా ఆరు మున్సిపాలిటీలకు టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడం, ఇన్‌చార్జి టీపీఎస్‌లతోనే పనులను చేపడుతున్నారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు సిబ్బంది లేక ఇబ్బందిగా మారుతోంది. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో 38,897 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది.

పరిశీలన బాధ్యత టీపీవోలదే..

మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ స్కీంకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన బాధ్యత మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులదే. దరఖాస్తులతో అనుమతులను ఇవ్వాలంటే ఎల్1, ఎల్2, ఎల్ 3 అని మూడు విభాగాలు ఉంటాయి. ఇందులో ఎల్1 అంటే టీపీబీవోలు ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తుకు సంబంధించి క్షేత్రస్థాయికి వెళ్లి స్థలాన్ని చూశాకే నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్ జోన్, చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు వంటివి ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా అన్నది స్పష్టంగా తెలియజేయాలి. పరిశీలించిన వాటిని ఎల్2 అంటే టీపీఎస్/టీపీవోలు సరిచూసుకుని ఓకే చేస్తేనే ఎల్3 అంటే కమిషనర్‌కు వెళుతుంది. ఎల్1, ఎల్2లో ఆమోదం పొందిన వాటికి ఎల్3లో మున్సిపల్ కమిషన్ ఆమోదం తెలపాలి. నిబంధనలకు లోబడి ప్లాటు ఉంటే కొలతలు, రిజిస్ట్రేషన్ సమయంలో మార్కెట్ విలువ వంటి వాటిని పరిశీలిస్తారు. ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో దరఖాస్తుదారులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి, వారి దరఖాస్తుల వివరాలను తెలుసుకుంటున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులు

మున్సిపాలిటీ	ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు
మంచిర్యాల	22,954
బెల్లంపల్లి	413
క్యాతన్‌పల్లి	7,089
లక్సెట్టిపేట్	2,163
మందమర్రి	39
నస్పూర్	4,919
చెన్నూర్	1,320
మొత్తం	38,897

పరిశీలన చేస్తున్నాం

అన్ని మున్సిపాలిటీల్లో 2020లో దరఖాస్తు చేసుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ఏవిధంగా ఉందో పరిశీలన చేస్తున్నాం. ఇప్పటికే అనుమతులు జారీ చేసినవి, ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన దరఖాస్తులు ఏమైనా ఉన్నాయో లేదో చూస్తున్నాం. క్షేత్రస్థాయికి వెళ్లకుండా, కేవలం కార్యాలయంలోనే వీటి పరిశీలన కొనసాగుతోంది. అవసరాన్ని బట్టి క్షేత్రస్థాయికి వెళ్లి ఆయా స్థలాలను పరిశీలించి అనుమతులను ఇవ్వాలో లేదో నిర్ణయిస్తాం.

– సత్యనారాయణ, మంచిర్యాల టౌన్ ప్లానింగ్ అధికారి

సమస్య తీరే వరకు తాగునీటి సరఫరా



ట్యాంకర్లను ప్రారంభిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తొలిగే వరకూ ఏటా వేసవిలో తన తండ్రి కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి సరఫరా అందించేందుకు నీటి ట్యాంకర్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడిని అరికట్టేందుకు ఆరేళ్లుగా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో, గతేడాది వచ్చిన వరదల్లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. మంచిర్యాలకు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నడిపెల్లి దివాకర్‌రావు ఇప్పటికీ మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలకు తాగునీటిని ఎందుకు సరఫరా చేయడం లేదో ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

సీసీసీ కార్నర్ వద్ద..

నస్పూర్: పట్టణంలోని తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ఉచితంగా నీటిని సరఫరా చేసే ట్యాంకర్‌ను సీసీసీ కార్నర్ వద్ద ప్రేమ్‌సాగర్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మంచి నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్న కాలనీలకు ట్రస్టు ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ వేసవిలో ఆరు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్లు శీపతి సుమతి, బొద్దున సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతుకు మద్దతేది?

- స్థానికంగా ప్రారంభం కాని కొనుగోళ్లు
- నాగపూర్ మార్కెట్‌లో జిల్లా రైతుల విక్రయాలు
- అక్కడ దళారులు చెప్పిందే ధర
- గిట్టుబాటు కాక నష్టపోతున్న రైతులు



తోటలో సేకరించి కుప్పగా పోసిన మామిడి కాయలు

బెల్లంపల్లి: మామిడి రైతులు ఈసారి కూడా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. మామిడి కాయల దిగుబడి తగ్గినపుడు సహజంగా ధర పెరిగి రైతుకు లాభం చేకూరాలి. కానీ ఈసారి దిగుబడి తగ్గినా ధర మాత్రం పెరగడం లేదు. మార్కెట్‌లో దళారులు చెప్పిన ధరకే రైతుల కాయలు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు నష్టానికి అమ్ముకుంటున్నారు. ఒకవైపు దిగుబడి తగ్గి.. మరోవైపు మద్దతు ధర దక్కక రైతులు నిండా మునుగుతున్నారు. జిల్లాలో బెల్లంపల్లి కేంద్రంగా మామిడి మార్కెట్ నిర్మించినా నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగి లేక పోవడంతో క్రయ విక్రయాలు జరగడం లేదు. దీంతో రైతులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మకాలు సాగిస్తున్నారు. ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి అక్కడకు వెళ్లి దళారుల చేతిలో దగా పడుతున్నారు.

ఆదిలో మురిపించి.. తర్వాత తగ్గించి..

జిల్లాలో పక్షం రోజులుగా మామిడి కాయల సేకరణ మొదలైంది. ఆదిలో నాగ్‌పూర్ వ్యాపారులు మద్దతు ధర చెల్లించి రైతులను ఆకర్షించారు. దశేరి రకం మామిడి కాయలకు గరిష్ఠంగా టన్నుకు రూ.95 వేలు, బంగెనపల్లి రకానికి టన్నుకు రూ.65 వేలు చెల్లించారు. ప్రస్తుతం ఆ ధరలు సగానికి పడిపోయాయి. దశేరి రకం కాయలకు టన్నుకు రూ.60 వేలు, బంగెనపల్లి రకానికి టన్నుకు రూ.30 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇక తోతపురి రకం కాయల ధర మొదట్లో రూ.32 వేలు ఉండగా ప్రస్తుతం రూ.15 వేలకు పడిపోయింది. 20 రోజుల వ్యవధిలోనే ధరలు సగానికి పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు తక్కువ ధర చెల్లించిన దళారులు ఆయా రకాల మామిడి కాయలను మాగించి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముతున్నారు. దశేరి కాయలు కిలోకు రూ.150, బంగెనపల్లి కిలో రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు.

చీడపీడలతో తగ్గిన దిగుబడి..

మామిడి తోటలకు ఈ దఫా బూజు, మంగు, బంక తదితర రకాల చీడపీడలు ఆశించాయి. పూత దశ నుంచే తోటలకు తెగుళ్లు సోకాయి. వాతావరణంలో మార్పులతో పూత కూడా అంతంత మాత్రంగానే వచ్చింది. కొన్ని తోటలకు పూత, కాత లేకుండా పోయింది. ప్రతి కూల పరిస్థితులు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. మరోవైపు వచ్చిన పూతను నిలుపుకోవడానికి, పురుగు మందుల వాడకానికి రైతులు హెక్టార్‌కు గరి ష్ఠంగా రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు చేశారు. అయినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు పేర్కొంటున్నారు. ఉద్యాన శాఖ అధికారుల లెక్క ప్రకారం హెక్టారుకు గరిష్ఠంగా 7 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉండగా ఈసారి 3 టన్నులకు మించి రాలేదని రైతులు పేర్కొంటున్నారు. ఒకవైపు దిగుబడి తగ్గగా, మరోవైపు మార్కెట్‌లో మద్దతు ధర లభించకపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి.

సన్నగిల్లుతున్న ఆశలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మామిడి తోటలకు మంచిర్యాల జిల్లా ప్రసిద్ధి. జిల్లా వ్యాప్తంగా 18 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. ఇసుక, ఎర్ర రేగడితో కూడిన సారవంతమైన నేలలు అపారంగా ఉండటంతో రైతులు మామిడి తోటలు సాగుచేశారు. అయితే మార్కెట్ ఒడుదుడుకులు ఎదురవుతుండటంతో తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ఉద్యానవన శాఖ అధికారులు రైతులను చైతన్యపర్చే కార్యక్రమాలేవీ నిర్వహించడం లేదు. మార్కెట్ సమస్యలను అధిగమించే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కొత్తగా తోటల పెంపకానికి ఔత్సాహిక రైతులు ముందుకు రావడం లేదు.

మద్దతు ధర లేదు



మామిడి తోటలకు ఈసారి పూత కాత సరిగా రాలేదు. అంతంత మాత్రంగానే కాపు కాసింది. కొద్ది మొత్తంగా కాపు ఉన్నా మద్దతు ధర ఉంటుందని ఆశపడ్డాం. కానీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర లేకుండా చేస్తున్నారు. దశేరి, బంగెనపల్లి రకాలకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్నా రైతులకు మాత్రం ఆ తీరుగా ధర చెల్లించడం లేదు.

– సందెల తిరుపతి, మామిడి రైతు, భీమారం

మ్యాంగో మార్కెట్‌లో కొనుగోళ్లు చేపట్టాలి



ఈసారి తోటలను మంగు తెగులు ఆశించింది. దీంతో కాయలపై మచ్చలు ఏర్పడ్డాయి. రెండుసార్లు అకాల వర్షాలు కురిసి పంటకు నష్టం కలిగింది. నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకు వెళ్లి కాయలను అమ్మకానికి పెడితే వ్యాపారులు టన్నుకు రూ.30 వేల నుంచి రూ.40 వేలకు మించి ధర చెల్లించడం లేదు. స్థానికంగా ఉన్న మ్యాంగో మార్కెట్‌లో మామిడి కాయల కొనుగోళ్లు చేపట్టాలి.

– గోగు సురేందర్, మామిడి రైతు, జెండా వెంకటాపూర్

వ్యాపారులు ముందుకు రావడం లేదు

బెల్లంపల్లి మ్యాంగో మార్కెట్‌లో ఈసారి కొనుగోలు చేయడానికి వ్యాపారులను సంప్రదించాం. ప్రత్యేకంగా జగిత్యాల మార్కెట్‌కు వెళ్లి నచ్చజెప్పాం. అక్కడి వ్యాపారులు ఏమాత్రం సానుకూలత వ్యక్తం చేయలేదు. ఇంత వరకు ఒక్క వ్యాపారి కూడా ట్రేడ్ లైసెన్స్ తీసుకోలేదు. అందుకే ఈసారి కూడా మ్యాంగో మార్కెట్‌లో మామిడి కొనుగోళ్లు చేపట్టలేదు.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి, మంచిర్యాల

బీజేపీ నుంచి దేశాన్ని కాపాడాలి

- బీఆర్ఎస్ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు



మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్‌రావు

తాండూర్: బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీఆర్ఎస్ మంచిర్యాల, కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. తాండూర్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలను విమర్శిస్తున్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతోందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధిప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న సుపరిపాలనను దేశవ్యాప్తం చేయాలనే సంకల్పంతో నే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నట్లుగానే ఈదఫా ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా విజయాన్ని అందించి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు భూతాలుగా మారి పీడిస్తున్నాయని విమర్శించారు. ఇంటి మనిషిలా అందరిలో కలిసి పోయిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని బీఆర్ఎస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. గిట్టని వారు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తనను ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. ఈసమ్మేళనంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ పి.సతీశ్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దత్తుమూర్తి, జెడ్పీ మాజీ చైర్మన్ పురుషోత్తంగౌడ్, వైస్ ఎంపీపీ దాగం నారాయణ, బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్



మాట్లాడుతున్న ఆవునూరి సాగర్

పాతమంచిర్యాల: గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆవునూరి సాగర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో జిల్లాలోని ఆయా గ్రామపంచాయతీలకు చెందిన గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలలో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని తెలిపారు. కానీ కార్మికులకు మాత్రం ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పని చేసే ప్రదేశాల్లో కార్మికులు ప్రమాదాల బారిన పడితే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రెండు రోజుల క్రితం భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాలలో కార్మికులు ప్రమాదానికిగురై చనిపోతే ఇప్పటి వరకు ప్రభుత్వ ఎలాంటి సహాయం చేయలేదని పేర్కొన్నారు. చనిపోయిన కుటుంబాలకు దిక్కెవరని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ కార్మికులు మల్టీపర్పస్ వర్కర్స్‌గా పని చేస్తూ పనిభారంతో అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, సబ్బులు, నూనె, బెల్లం, చెప్పులు, యూనిఫాం, అందించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం 18 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి సురేశ్, కార్యదర్శి చందు, ఉపాధ్యక్షుడిగా సాయికృష్ణ, కోశాధికారిగా చిన్నన్న, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

హడలెత్తిస్తున్న అకాల వర్షాలు



కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

దండేపల్లి/బెల్లంపల్లి: అకాల వర్షాలు అన్నదాతను హడలెత్తిస్తున్నాయి. దండేపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం గాలి దుమారంతోపాటు వర్షం కురిసింది. దీంతో రైతులు కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పారు. కొన్ని చోట్ల వర్షానికి ధాన్యం తడిసింది. బెల్లంపల్లిలోనూ అకాల వర్షం కురిసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై అరగంటపాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం



ఉత్సవాల్లో పాల్గొన్న సునీల్ మాదిగ, నాయకులు

నస్పూర్: బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలను కొనసాగిద్దామని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ మాదిగ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మ జ్యోతిబా పూలే, అంబేద్కర్ జయంతిని నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. సునీల్‌మాదిగ మాట్లాడుతూ మాదిగలకు రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మంచిర్యాలలో మహనీయుల విగ్రహాల ఏర్పాటు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్‌వాది తోటపల్లి భూమన్న మహారాజ్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శీపతి, మాజీ ఎంపీటీసీ లింగయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న, నాయకులు కొప్పర్తి రాజం, కదారి రమేశ్, తొప్పెట్ల శ్రావణ్, ఉదయ్, అట్కపురం సమ్మయ్య, సీపల్లి సాజన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో మాజీ ఉప సర్పంచ్ మృతి

శ్రీరాంపూర్: సింగపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ సిద్దం శంకర్ (60) గుండె పోటుతో మృతి చెందాడు. అరుణక్కనగర్‌కు చెందిన శంకర్ శనివారం మధ్యాహ్నం అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గుండె పోటుగా అనుమానించి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స మొదలు పెట్టే సయమానికే గుండెపోటుతో మృతి చెందాడు. శంకర్ సింగరేణి కార్మికుడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. ఇతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు.

యువకుడి మృతి


నరేశ్ మృతదేహం

ఆసిఫాబాద్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన జంపాల నరేశ్ (35) ఆదివారం ఉదయం ఆకస్మాత్తుగా కిందపడి మృతి చెందాడు. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నరేశ్ తిరిగి వచ్చి ఇంటి ఎదుట ఆకస్మాత్తుగా పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న జంపాల సుభాష్ ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


చిందరవందరగా పడిపోయిన సామగ్రి

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామ సమీపంలోని నజీర్‌పల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన అంజి ఇంటి సామగ్రిని ట్రాలీలో నింపుకుని మంచిర్యాల వైపు వెళ్తున్నాడు. వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ట్రాలీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో ట్రాలీలోని సామగ్రి చిందరవందగా పడిపోగా అంజితో పాటు మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో మంచిర్యాల ప్రభుత్వసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భాగ్యనగర్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన కీర్తి నర్సింగ్ శుభకార్యంలో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొన్నారి గ్రామానికి వెళ్లారు. ఆదివారం ఉదయం 10.30 ప్రాంతంలో నర్సింగ్ కుమారుడు దుస్తుల కోసం ఇంటికి వచ్చాడు. తాళం పగలగొట్టి ఉండటం గమనించి కుటుంబీకులకు సమాచారం అందించాడు. వారు అక్కడి చేరుకున్నారు. ఇంట్లోని 15 గ్రాముల బంగారం, 7 తులాల వెండి, టీవీ, హోంథియేటర్, సెటాప్ బాక్స్, రూ.వెయ్యి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు టుటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కృత్రిమ పిట్ట గూళ్లు


డివిజన్ కార్యాలయం కట్టిన కృత్రిమ పిట్టగూడు


నూతనంగా తయారు చేసిన పిట్టగూడు

వేసవిలో ఎండలు ఎక్కువ కావడంతో పక్షులు నీటి కోసం, ఆహారం కోసం, గూడు కోసం అల్లాడుతాయి. వాటికి ఉపశమనం కలిగించేందుకు అటవీశాఖ అధికారులు నూతన విధానం ఏర్పాటు చేశారు. కూడు, గూడు, ఆవాసం అందే విధంగా జంతువులతో పాటు పక్షులకు కూడా కృత్రిమ గూళ్లను తయారు చేశారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవి డివిజన్‌లో పలు ప్రాంతాల్లో ఎఫ్‌డీవో మాధవరావు ఆదేశాల ప్రకారం బీట్ అధికారులు కృత్రిమ గూళ్లను తయారు చేసి అడవిలో పచ్చని చెట్లకు అమర్చారు. గూళ్లతో పాటు నీటి సౌకర్యం కలిగించే విధంగా చిప్పలను ఉంచి వాటిలో నీరు పోస్తున్నారు. జన్నారం అటవి డివిజన్‌లో ప్రతి బీట్‌లో పది నుంచి 15 వరకు కృత్రిమ పిట్టగూళ్లను ఏర్పాటు చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు. – జన్నారం


అదవిలో చెట్టుకు కట్టిన కృతిమ పిట్టగూళ్లు

గుడుంబా మత్తు

ఈ నెల 9న వేమనపెల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గుడుంబా అమ్మవద్దని దుర్గం శివరాం విక్రయదారుడిని ప్రశ్నించాడు. దీంతో శివరాంపై విక్రయదారుడు దాడి చేయడంతో పాటు అధికారులందరికీ మామూళ్లు ఇస్తున్న.. నీ దిక్కున్న చోట చెప్పుకోమని బహిరంగంగా హెచ్చరించాడు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు చెబితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని చెప్పడం గమనార్హం. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఏదో ఒక చోట చోటుచేసుకుంటున్నానే ఉన్నాయి. అధికారులు నామమాత్రంగా దాడులు చేయడం మినహా పూర్తిస్థాయి నివారణకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

- జిల్లాలో విచ్చలవిడిగి తయారీ
- నాటుసారా తయారీ కేంద్రంగా అటవీ ప్రాంతం
- మహారాష్ట్ర నుంచి ముడిసరుకు దిగుమతి
- 'మాములు'గా తీసుకుంటున్న అధికారులు
- తయారీ, విక్రయదారులకు పునరావాసం కల్పించినా ఫలితం శూన్యం


విక్రయదారులను పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బంది (ఫైల్)

జిల్లాలో రెండు సంవత్సరాల్లో నమోదైన కేసులు...

ఏడాది	కేసులు	అరెస్ట్	పట్టుకున్న గుడుంబా
2021	516	121	568 లీటర్లు
2022	415	373	1897 లీటర్లు
2023(మార్చి)	112	114	532 లీటర్లు




గుడుంబా తయారీదారులు దిగుమతి చేసుకున్న ముడిసరుకు

సమాచారం అందించి సహకరించాలి

సారా బట్టీలపై నిరంతరం దాడులు చేస్తున్నాం. జిల్లాలో ప్రత్యేక టీమ్ ద్వారా తనిఖీలు చేపడుతున్నాం. గుడుంబా తయారీ, విక్రయాలపై సమాచారం అందించి సహకరించాలి. గుడుంబా నిర్మూలనకు అందరూ కృషి చేయాలి. ముడిసరుకు విక్రయాదారులపై చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. – కేజీ. నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, మంచిర్యాల

మంచిర్యాలక్రైం: గుడుంబా పచ్చని కుటుంబాల్లో విషాదం నింపుతోంది. తాగుడుకు బానిసై పలువురు యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు మద్యం మత్తులో హత్యలకు తెగపడుతున్నారు. మరెందరో అనారోగ్యానికి గురై మృత్యువుకు దగ్గరవుతున్నారు. గుడుంబాను అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం కానరావడం లేదు. దీంతో గుడుంబాకు బానిసై అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కొందరు అక్రమార్కులు దీనిని సొమ్ము చేసుకుంటున్నారు. తయారీకి గ్రామ సరిహద్దు గ్రామాలను అడ్డాలుగా ఎంచుకుంటున్నారు.

ప్రాణహిత సరిహద్దు గ్రామాల్లో...

మంచిర్యాల జిల్లాలో అధికంగా ప్రాణహిత సరిహద్దు గ్రామాల్లో గుడుంబా తయారు చేస్తున్నారు. ప్రధానంగా అటవీ సమీపంలోని ఆల్గామా, దేవులవాడ, వెలుమపల్లి, మల్లంపేట, కోటపల్లి, వెంచపల్లి, సిర్సా, అన్నారం, అర్జునగుట్టా, జన్నారం, బీమారం, శివ్వారం, నెన్నెల అటవీ ప్రాంతాలు గుడుంబా తయారీకి అనువుగా మారాయి. అడవుల్లో బట్టీలు ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా తయారు చేసి విక్రయిస్తున్నారు. దీనికి ముడిసరుకు మహారాష్ట్ర నుంచి సరఫరా అవుతున్నట్లు సమాచారం.

అడవిలోనే మకాం...

నాటుసారా చేసేందుకు వ్యాపారులు అడవుల్లోనే రోజుల తరబడి మకాం వేస్తున్నారు. సార తయారీకి అవసరమైన ముడిసరుకు తుమ్మ చెక్క, బెల్లం, యూరియా, పటిక బెల్లం చేరవేస్తున్నారు. వారికి అవసరమైన ఆహార పదార్థాలను వెంట తీసుకెళ్తూ అక్కడే ఉంటున్నారు. నాటుసారా తయారీకి ముడిసరుకు, ఆహార పదార్థాలను తరలించేందుకు కూలీలను పెట్టుకుంటున్నారు. వీరికి రోజుకు రూ.5వందలు చెల్లిస్తున్నట్లు సమాచారం.

ఫలించని పునరావాస వ్యూహం...

నాటుసారా నియంత్రణకు ప్రభుత్వం సారా విక్రయదారులను, తయారీదారులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టింది. పునరావాసం కింద రూ.2లక్షల విలువైన వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు ఆర్థిక సాయం అందజేసింది. జిల్లాలో 211మంది గుర్తించి 210 మందికి పూర్తి స్థాయిలో పునరావాస ప్యాకేజీని 2017లో అందించింది. ఇటీవల మళ్లీ గుడుంబా విక్రయాల వైపు మొగ్గుచూపుతున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

- ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి


డ్రైవర్లు, కండక్టర్లకు శిక్షణ ఇస్తున్న ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి

ఆదిలాబాద్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా డ్రైవర్లు కండక్టర్లు కృషి చేయాలని ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు ఇస్తున్న ట్యాక్ (టీఎస్ ఆర్టీసీ ఏప్రిల్ ఛాలెంజ్ ఫర్ ట్రైనింగ్)లో ఆదివారం పాల్గొని పలు అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి చేరువ కావాలన్నారు. వారితో మమేకమవుతూ వారికి మెరుగైన సేవలందించడానికి పాటుపడాలన్నారు. ప్రాజెక్టర్ ద్వారా వృత్తి నైపుణ్యాలు, ఇతర అంశాలపై శిక్షణ అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామంలో సత్యనారాయణ ఇంట్లో శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్రిప్రమాదం జరిగింది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాలు.. సత్యనారాయణ ఇంట్లోని కూలర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. కుటుంబీకులు కేకలు వేయడంతో చుట్టూపక్కల వారు వచ్చి మంటలారిప్రేశారు. ఈ ప్రమాదంలో దుస్తులు, వంట సామగ్రి, ఫర్నిచర్ సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.

అన్ని రకాల వ్యాధులకు హోమియో వైద్యం



సెమినార్‌లో పాల్గొన్న వైద్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలటౌన్: రానున్న రోజుల్లో హోమియోపతిక్ వైద్యం ఎంతో కీలకంగా మారనుందని పలువురు వైద్యులు తీర్మానం చేశారు. ఆదివారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని హోమియోపతిక్ ఫిజిషియన్స్ అసోసియేషన్ భవన్‌లో హోమియో పితామహుడు డాక్టర్ హనిమెన్ జయంతి వేడుకలతో పాటు హోమియోపతిక్ సైంటిఫిక్ రాష్ట్ర సెమినార్‌ను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన హోమియో ప్రత్యేక సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ గణేశ్ ఆచార్యలు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల గుర్తించడంతో పాటు వ్యాధి నివారణకు చేపట్టాల్సిన వివరాలను సెమినార్‌లో తెలియజేశారు. హోమియో వైద్యంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం లభిస్తుందని తెలిపారు. వైద్య వృత్తిలో కొత్త మెళుకువలతో పాటు రోగులకు అధునాతన వైద్యం అందించడానికి సెమినార్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. సెమినార్‌లో రాష్ట్ర హోమియోపతిక్ ఫిజిషియన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ స్వామి, డాక్టర్ రాజు, మంచిర్యాల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కిరణ్, డాక్టర్ నాగేంద్ర ఉపాధ్యాయ, కోశాధికారి డాక్టర్ గౌరీశంకర్, వైద్యులు సుగుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఇక్బాల్, సలీం, ముంతాజ్, ప్రవీణ్‌రెడ్డి, సునీల్, క్రిష్ణ, నాగేందర్, నవీణ్, శోభారాణి పాల్గొన్నారు.

ఒకే క్షేత్రం.. పంటలు అనేకం


సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోట

- మామిడి, ఆయిల్ పామ్, సపోటా, మల్బరి
- చేపలు, నర్సరీల పెంపకం
- సేంద్రియ ఎరువుల వాడకం
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు మధు


చేపలకు ఆహారం అందిస్తున్న రైతు


మామిడితోటలో అంతర పంట మల్బరి

చెన్నూర్‌రూరల్: అదో వ్యవసాయక్షేత్రం.. అందులోకి వెళ్తే పలు రకాల పంటల సాగు, ఆ క్షేత్రం చుట్టూ టేకు మొక్కలు, మల్బరి, వేప మొక్కలను పెంచుతున్నాడు. 2008లో మామిడి మొక్కలతో ప్రారంభించిన వ్యవసాయ క్షేత్రం ఆ రైతుకు ఉపాధిని ఇస్తుంది. చెన్నూర్ పట్టణానికి చెందిన మద్ద మధు అనే రైతుకు మండలంలోని లంబడిపల్లిలో సుమారు ఎడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో మూడెకరాల్లో మామిడి చెట్లు, రెండెకరాల్లో ఆయిల్‌పామ్, అరెకరంలో చేపల పెంపకం, మరో ఎకరంన్నరలో సపోటా, ఎర్ర చందనం, కంకవనం, సీతాఫలం, ఇతర మొక్కలు పెంచుతున్నాడు. ఆయిల్ పామ్‌లో అంతర పంటగా మలబారీ మొక్కలు పెంచుతున్నాడు. అక్కడే అయిదు గుంటల స్థలంలో షెడ్డు నిర్మాణం చేసి పట్టు పురుగులను పెంచుతున్నాడు. వ్యవసాయ క్షేత్రం చుట్టూ సుమారు వెయ్యి టేకు మొక్కలు, అంతర పంటలుగా మినుములు, కూరగాయలు సాగు చేస్తున్నాడు. కంపోస్టు పిట్‌ను ఏర్పాటు చేసి అందులో ఆకులు, ఇతర వ్యర్థాలను వేసి సేంద్రియ ఎరువును తయారు చేసి పంటలకు అందిస్తున్నాడు. వ్యవసాయ, పట్టు పరిశ్రమల శాఖల అధికారుల సలహాలు తీసుకుంటూ ముందుకెళ్తున్నాడు.

ప్రశాంతంగా టీజీ సెట్


పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీసెట్) -2023 ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్‌లో ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణ కోసం రీజియన్ పరిధిలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 8,075 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 7,627 మంది హాజరయ్యారు. 448 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో 94.45 శాతం విద్యార్థుల హాజరు శాతం నమోదైనట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కో–ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,397 మందికి 2,238 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 8 పరీక్ష కేంద్రాల్లో 2,603 మంది విద్యార్థులకు 2,467 మంది పరీక్షకు హాజరయ్యారు. అదే తీరుగా మంచిర్యాల జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఉండగా వీటిలో 3,075 మంది విద్యార్థులకు 2,922 మంది పరీక్ష రాశారు. పరీక్ష ఉదయం 11గంటలకు ఉండగా విద్యార్థులు ముందస్తుగా ప్రకటించినట్లుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల ప్రధాన ద్వారాల వద్ద విద్యార్థులను నిశితంగా పరీక్షించిన తర్వాత లోనికి పంపించారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన కో ఆర్డినేటర్

బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్ష కేంద్రాలను సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి సందర్శించారు. రాష్ట్రర ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాల (టీఎస్ ఆర్ఎస్), సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలతో పాటు సీఓఈ బాలుర కళాశాల పరీక్ష కేంద్రాలకు వెళ్లి విద్యార్థులు రాస్తున్న పరీక్ష తీరును పరిశీలించారు. ఆమె వెంట ఆయా పరీక్ష కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, బి.శ్రీనివాస్, ఊటూరి సంతోష్‌కుమార్, ఎస్.స్వరూప, డిపార్ట్‌మెంటల్ అధికారులు ప్రేమరాణి, తులసి, విశ్వాస్, దేశీపాల్, కవితరాణి ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాళ్ల గురిజాల ఎస్సై బందోబస్తును పర్యవేక్షించారు.

పగిలిన తాగునీటి పైపులైన్


పగిలిన పైపుల నుంచి రోడ్డుపైకి వచ్చిన తాగునీరు

మంచిర్యాలటౌన్: రైల్వే ఓవర్‌బ్రిడ్జి నుంచి పాతమంచిర్యాల రాళ్లవాగు వంతెన వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తాగునీటి పైప్‌లైన్ ఆదివారం సాయంత్రం వైశ్య భవన్ సమీపంలో పగిలిపోయింది. దీంతో నీరంతా రోడ్డుపై చేరింది. సోమవారం ఒడ్డెర కాలనీ, మారుతి నగర్, అంబేద్కర్ నగర్, సుభాష్‌రోడ్డు, గొల్లవాడ, హైటెక్‌సిటీ కాలనీలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ద్యాగవాడ చెందిన బండారి శ్రీను కుమారుడు సత్యవంశీ (19). హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రెండురోజులు సెలవులు ఉండడంతో శుక్రవారం నిర్మల్‌కు వచ్చాడు. ఆదివారం సాయంత్రం స్నేహితుడితో కలిసి బైక్‌పై బయటకు వెళ్లాడు. బైక్ అదుపుతప్పి మృతిచెందాడు.

'బాల్క సుమన్‌తో ప్రాణహాని'


వినతిపత్రం అందించిన వైఎస్సార్‌టీపీ నాయకులు

మందమర్రిరూరల్: ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో చెన్నూర్ నియోజకవర్గ ప్రతిపక్ష పార్టీల నాయకులకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వమే రక్షించాలని కోరుతూ మందమర్రిలోని అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్‌టీపీ నాయకులు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కోర్డినేటర్ దుర్గం నగేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రశ్నిస్తే తుపాకీతో కాలుస్తానని ప్రతిపక్ష పార్టీల నాయకులను బెదిరించాడని పేర్కొన్నారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే చేసిన అభివృద్ధి చూపించాలే తప్ప బెదిరించడం ఏమిటని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజీమొద్దీన్, నాయకులు ప్రభుదేవ, రాజేంద్ర ప్రసాద్, సాయి కిషోర్, శ్రీనివాస్, అబీద్, సునీత, విజయ ఉన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కడెం: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన ఎనగందుల శంకరవ్వ (60) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రాజు కథనం ప్రకారం..శంకరవ్వ గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించుకున్నా ఎంతకీ నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.